# సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

**గడపగడపకూ ఫలాలు**
**మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

## సీఎం కేసీఆర్ కృషి వల్ల గిరిజనులకు సాధికారత


మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సార్లరావులపల్లితండా గిరిజనులు

### మంత్రి, ఎమ్మెల్యేల సమక్షంలో బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

కందుకూరు, అక్టోబర్ 12 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి సబితారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సార్లరావులపల్లి తండాకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీల శ్రేణులు మంత్రి నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలను కప్పి మాట్లాడారు. గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు వివరించారు. గిరిజనులను రాజకీయాల్లోకి తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని చెప్పారు. కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయాలని కోరారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల మద్దతు తనకు ఉందని.. తన గెలుపు కోసం పని చేయాలని కోరారు. ప్రజలు ఆశేర్వదించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు తగిన బుద్ధి చెప్పి చిత్తుగా ఓడించాలన్నారు. ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ గిరిజన తండాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న అనంతరం అధికారంలోకి వచ్చిన అనంతరం సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. 500 జనాభా ఉన్న గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి వారి తండాలను వారు ఏలుకునేలా చేసినట్లు చెప్పారు. గిరిజన తండాలకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేసినట్లు మంత్రి వివరించారు.

### 60 ఏండ్లలో చేయని అభివృద్ధి.. తొమ్మిదేండ్లలో..!

బంట్వారం : గత ప్రభుత్వాలు 60 ఏండ్లలో చేయని అభివృద్ధిని.. అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ 9 ఏండ్లలో చేసి ప్రజల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకుందని ఈ ఘనత కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మండలంలోని మాలసోమారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. పార్టీ అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యమిస్తున్నదని పేర్కొన్నారు.


బంట్వారం : ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాలసోమారం యువత

### బీఆర్ఎస్‌తోనే భావితరాలకు భరోసా

కోట్‌పల్లి : భావితరాలకు భరోసానిచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం కోట్‌పల్లి మండలంలోని బీరోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, వికారాబాద్‌లోని గంగారానికి చెందిన సీనియర్ నాయకుడు బాల్‌రాజ్ గౌడ్, బీజేపీ నాయకుడు వెంకటేశ్‌గౌడ్, వారి అనుచరులకు ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోట్‌పల్లి మండల అధ్యక్షుడు అనిల్ ఉన్నారు.

### అభివృద్ధికి నిదర్శనం బీఆర్ఎస్ పాలన

షాద్‌నగర్ : బీఆర్ఎస్ పాలన అంటేనే అభివృద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం షాద్‌నగర్‌లో ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి మన కండ్ల ముందు కనిపిస్తున్నదనే విషయాన్ని మనమందరం గుర్తించాలన్నారు. పల్లె ప్రగతి ద్వారా పల్లెలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాయని పేర్కొన్నారు. అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువల వంటి మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఎన్నో ఏండ్లు పాలించిన ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏం చేసాయో ప్రజలకు తెలుసని, మరోమారు ప్రజలను మోసం చేసేందుకు ఓట్ల పేరుతో మన వద్దకు వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు


ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

### ప్రత్యేక నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధి

తాండూరు, అక్టోబర్ 12 : తాండూరు పట్టణం 15వ వార్డుకు చెందిన బీజేపీ నాయకురాలు సుజాతతోపాటు మరికొంతమంది గురువారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యధిక మెజార్టీతో తాండూరులో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పనిచేస్తూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఎన్నికల అనంతరం తాండూరుకు ప్రత్యేక నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు.

# యువతనే నిర్ణేత

- జిల్లాలో సగం మంది యువ ఓటర్లే
- 19-39 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న ఓటర్లు 16,70,492 మంది
- తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్న 66,359 మంది
- అసెంబ్లీ ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా నిలువనున్న రంగారెడ్డి జిల్లా యువత

రంగారెడ్డి, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ) : యువత ఓటే శాసనంగా మారబోతున్నది. అభ్యర్థుల గెలుపు ఓటములపై తీవ్ర ప్రభావాన్ని చూపబోతున్నాయి. రంగారెడ్డి జిల్లా తుది ఓటర్ల జాబితాను వయస్సుల వారీగా పరిశీలిస్తే పలు ఆసక్తికర అంశాలు వెల్లడవుతున్నాయి. జిల్లా మొత్తం ఓటర్లు 33,56,056 మంది ఉండగా.. అందులో 19-39 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న ఓటర్లు 16,70,492 మంది ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్న యువ ఓటర్లు 66,359 మంది ఉన్నారు. వెరసి.. రాబోవు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నిర్ణయాత్మక శక్తిగా జిల్లాకు చెందిన యువత నిలువబోతున్నది.

#### ఫలించిన ప్రచారం

కొత్త ఓటర్ల నమోదుపై అధికారులు చేపట్టిన విస్తృత ప్రచారం జిల్లాలో ఫలించింది. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కళాశాలలు, కోచింగ్ సెంటర్లు తదితర వాటిల్లో ప్రచారం నిర్వహించారు. మీడియా ద్వారా కూడా విస్తృత ప్రచారం చేశారు. కొన్నిచోట్ల రాజకీయ పార్టీల నేతలు దగ్గరుండి కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఈ క్రమంలోనే జిల్లాలో 66,359 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుని ఈసారి ఎన్నికల్లో మొదటిసారిగా ఓటెయ్యబోతున్నారు. నియోజకవర్గాలవారీగా కొత్త ఓటర్ల వివరాలను పరిశీలిస్తే.. ఇబ్రహీంపట్నంలో 9,174., ఎల్బీనగర్‌లో 8,566., మహేశ్వరంలో 9,863., రాజేంద్రనగర్‌లో 10,488., శేరిలింగంపల్లిలో 8,663., చేవెళ్లలో 6,413., కల్వకుర్తిలో 6,708., షాద్‌నగర్‌లో 6,484 మంది ఉన్నారు.



#### జిల్లాలో వయస్సువారీగా ఓటర్లు

| నియోజకవర్గం | 19- 39 | 40-59 | 60-99 |
|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 1,67,280 | 1,04,664 | 38,681 |
| ఎల్బీనగర్ | 2,61,418 | 2,18,870 | 86,440 |
| మహేశ్వరం | 2,60,961 | 1,86,096 | 70,139 |
| రాజేంద్రనగర్ | 2,77,402 | 2,00,882 | 64,023 |
| శేరిలింగంపల్లి | 3,36,287 | 2,71,339 | 90,412 |
| చేవెళ్ల | 1,26,900 | 88,207 | 38,753 |
| కల్వకుర్తి | 1,20,070 | 75,562 | 34,926 |
| షాద్‌నగర్ | 1,20,194 | 73,752 | 31,504 |

#### శతాధిక వృద్ధులు 532 మంది

జిల్లాలో వందేండ్లు పైబడిన వారు 532 మంది ఉన్నట్లు తుది ఓటరు జాబితా స్పష్టం చేస్తున్నది. 100 నుంచి 109 ఏండ్లు వయసుగల ఓటర్లు 371 మంది ఉండగా.. 110 నుంచి 119 ఏండ్లున్న వారు ఆరుగురు మాత్రమే ఉన్నారు. 120 ఏండ్లు పైబడిన వారు 155 మంది ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

# ప్రజలకు చేరువలో పాలన

- భవిష్యత్తులో వికారాబాద్‌లో అభివృద్ధి
- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను గెలిపించుకోవాలి
- చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 12 : రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్ అద్భుతమైన మ్యానిఫెస్టోను ప్రవేశపెట్టనున్నారని, దీంతో ప్రతిపక్ష పార్టీలకు నోరు వెళ్లబెట్టాల్సి ఉంటుందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్‌లో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనంద్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యంతో వికారాబాద్ ప్రాంతం చాలా వెనుకబడి పోయిందన్నారు. కలెక్టర్లు, జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు ఎవరూ స్థానికంగా ఉండేవారు కాదన్నారు. వారిని కలిసేందుకు ఉదయం వెళ్తే ఎప్పుడు దొరుకుతారో తెలియని పరిస్థితి నెలకొనే రోజులు గుర్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వికారాబాద్ ప్రాంత ప్రజల సౌకర్యార్థం జిల్లా ఏర్పాటు చేయడంతోపాటు కలెక్టరేట్, ఇతర జిల్లా అధికారులందరూ ప్రజలకు చేరువలో ఉన్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఆనంద్ స్థానికుడేనని, ఎవరెప్పుడు పిలిచినా పలికే వ్యక్తి అని కొనియాడారు. ఎమ్మెల్యే ఆనంద్‌ను, కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు.

#### దేశానికి ఆదర్శంగా తెలంగాణ

దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరుగని అభివృద్ధి, సంక్షేమం మన రాష్ట్రంలో జరిగి దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పక్క రాష్ట్రాల మాదిరిగా అభివృద్ధిలో మరో 60 ఏండ్లు వెనక్కి వెళ్లిపోవడం ఖాయమన్నారు. దమ్ముంటే తెలంగాణలో ప్రవేశపెట్టిన పథకాలు రైతుబీమా, మెడికల్ కళాశాల, దళిత బంధు, మిషన్ భగీరథ, కల్యాణలక్ష్మి వంటి పథకాలను కాంగ్రెస్, బీజేపీ పాలిత ప్రాంతాల్లో ప్రవేశపెట్టి అమలు చేయాలన్నారు. వికారాబాద్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు.

#### అనంతగిరిని టూరిజంగా అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. వికారాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ సైన్యం చాలా ఎక్కువగా ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే రాబోయే రోజుల్లో మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సహకార సంఘం తదితర ఎన్నికల్లో మరోసారి గెలిపించుకుంటామని తెలిపారు. వికారాబాద్ ప్రాంతానికి ఎంఎంటీఎస్ రైలును తీసుకొస్తానని మంత్రి కేటీఆర్ తనతో చెప్పారన్నారు. మోమిన్‌పేటలో పరిశ్రమలు నెలకొల్పడంతోపాటు, వికారాబాద్ అనంతగిరిని టూరిజంగా అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. త్వరలో బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభం అవుతాయని వివరించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రతి పథకం గ్రామాల్లో, వార్డుల్లో ప్రతి గడపకు చేరాయన్నారు. కాంగ్రెస్ వారు వారి పాలనలో ఇన్ని పథకాలు ఎందుకు ప్రవేశపెట్టలేదని ఎమ్మెల్యే నిలదీశారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు నందు, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ దీప, మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులున్నారు.